## కథ

**-టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి**

# సబ్జా

**విశాఖ వెళ్ళి వచ్చిన అప్పారావుగాడు రెండు వార్తలు పట్టుకు వచ్చాడు. ఒకటేమో నేను ఆనంద పారవశ్యంతో ఉక్కిరిబిక్కిరయిపోయిన వార్త...**

**"వైజాగ్‌లో అనుకోకుండా జయంతిని చూశాను..వాళ్ళ కుటుంబం ప్రస్తుతం అక్కడే ఉంటోంది!"**

**ఆ వెనువెంటనే మనసుకు చాలా బాధ కలిగించే విషాద వార్త కూడా అందజేశాడు వాడు.'తన భర్త ఇటీవలే పోయాడు!"**

**ఆనంద విషాదాల మధ్యని సరిహద్దు సరళరేఖ మీద నిలబడిపోయిన వాడిలా అవాక్కయిపోయాను.**

**నా మనసు మాత్రం 'జయంతీ..జయంతీ!' అని పలవరిస్తోంది. ఆక్రోశిస్తోంది కూడా!**

★ ★ ★

ఎప్పటి మాట? ముప్పయి సంవత్సరాల పైమాటే...

ఘటోద్గజపురం ఎలిమెంటరీ స్కూల్లో ఈఎస్సెల్సీ పూర్తి చేసి హైస్కూల్లో అడుగు పెట్టిన అమూల్యమైన రోజులు. 'ఫ్లేం ఆఫ్ ది ఫారెస్ట్' చెట్ల వరుసల క్రిందుగా స్కూలు సంచి భుజానికి తగిలించుకుని హైస్కూలుకేసి నీరెండలో నడవడంలో అద్వితీయమైన అనుభూతి ఉండేది.

స్కూలు పరీక్షలలో కాపీ కొట్టడం అనేది తెలియదు మాకు. అంతటి బంగారు రోజుల్లోనూ నాకో దురలవాటు మాత్రం ఉండేది. ఇంట్లో..మా నాన్నగారి చొక్కా జేబులోనో, మా తాతగారి కోటు జేబులోనో తల్లిగారి బట్టల అల్మైరాలోనో, తమ్ముడి హుండీలోనో డబ్బులు కాజెయ్యడం!

ఓ రోజు..మామూలు ప్రకారమే మా నాన్నగారి జేబులో చెయ్యి పెడ్తే చిల్లర తగల లేదు. అందువల్ల దొరికిన నోట్లలోంచి ఓ నోటు పట్టుకుని వెళ్ళిపోయాను. ఆ కంగారులో అది కాస్త పెద్ద నోటన్న విషయం నేను చూసుకోలేకపోయాను. అది వంద నోటని నేను గ్రహించడానికి మునుపే నా మిత్రుడి అన్న ఒకడు తెలివిగా నా వద్ద దాన్ని కాజేశాడు.

నేను సాయంకాలం ట్యూషనులో ఉండగా ఇంటినుండీ కబురు వచ్చింది. ట్యూషను మధ్యలోంచీ ఇంటికి వెళ్ళి నాకేం తెలియదని బుకాయించాను. దాంతో ఒళ్ళు మండిపోయిన మా నాన్నగారు ఎడాపెడా రెండు వాయించారు.

"వెధవ డబ్బు పోతే పోయిందిలేరా! వాడ్ని చావబాదడం ఎందుకు?" అంటూ అడ్డుపడింది నాయనమ్మ.

"పోయిన డబ్బు గూర్చి కాదు. వీడు ఎవరికి చెడి చెంగల్పట్టు జైలు పాలవుతాడేమో నన్నది కదా నా బాధ?" అంటూ ఇహ తిట్లు మొదలు పెట్టారు ఆయన.

నాయనమ్మ మళ్ళీ అడ్డుకుని ఆపద్ధర్మంగా నన్ను రక్షించే ప్రయత్నంలో మళ్ళీ ట్యూషన్‌కు తోలేసింది ఎలాగో.

మళ్ళీ ట్యూషన్‌లో అడుగు పెట్టగానే జయమ్మ టీచర్ అడిగారు.."ఎందుకురా అంత జరూరుగా పిలిపించారు?" అని.

"మామిడిపండ్లు తినడానికి" అని చెప్పేశాను అలవోకగా.

అయితే అప్పటికే ఆ విషయం మా వీధిలో చాలామందికి తెలిసిపోయింది. మూడో ఇంటివారే అయినందున జయంతికి కూడా తెలిసిపోయినట్లుంది.

మరుసటి రోజు సాయంకాలం నేను ట్యూషన్‌లో అడుగుపెట్టడం ఆలస్యం. "నిన్న తిన్న మామిడిపండ్లు బావున్నాయా?" అంటూ నవ్వింది జయంతి. ముత్యాల్లాంటి పలువరస, చర్రీఫ్రూట్ రంగు లేత పెదవుల వెనుక వింతగా ప్రకాశిస్తోండగా.

ఆరోజు జయంతి నవ్వులో వింత కాంతి ఏదో మెరుస్తూ ప్రత్యేకంగా కన్పించింది నా కళ్ళకు. తెల్లని ముఖంలో నల్లగా మెరుస్తున్న కాటుక కళ్ళు, నల్లని కురుల మధ్యన నడి పాపిట మీదుగా తళతళ మెరుస్తున్న సన్నని బంగారు చైనుకు నుదిటి మీదకు వ్రేలాడుతున్న తళుకులీనుతున్న రాళ్ళ పాపిట బిళ్ళ... వీటితో ఆమె నవ్వు మరింత మనోహరంగా కన్పించింది కాబోలు ఆకర్షణీయంగా మనసులో ముద్రపడిపోయింది.

అందుకే తను ట్యూషన్‌లో వున్నవారికీ, జయమ్మ టీచరుగారికీ కూడా నన్నో దొంగగా అభివర్ణించి నా చర్యలను దృశ్యమానం చేసినా, ఎప్పుడూ నన్నేమీ అనని జయమ్మ టీచరుగారు బెత్తంతో రెండంటించినా నాకు బాధనిపించలేదు ఏ కాస్తయినా!

అంతవరకూ నాకే ఆడపిల్లా అలా కన్పించి ఉండలేదు మరి.

అప్పటిదాకా రాత్రులందు సమ వయస్కులైన ఆడపిల్లలతో, మగపిల్లలతో కలిసి 'సబ్జా' ఆట ఆడడం అలవాటే..అందరూ వెళ్ళి దాక్కుంటే ఒక్కరు అందర్నీ వరుసగా వెతికి పట్టుకుని 'సబ్జా!' చెప్పడం.

ఎన్నోసార్లు ఆడపిల్లలతో సందు గొందులలో నక్కి-దాక్కున్నప్పుడు వారి శరీర భాగాలు మెత్తగా, వింతగా ఒరుసుకున్నా కూడా ఎదుటి వ్యక్తి స్త్రీ అనీ నేను పురుషుడ్ననీ ఎప్పుడూ మననానికి రాలేదు. ఎంతసేపూ దొరికి పోకుండా దాక్కోవాలన్న ధ్యాస మాత్రమే ఉండేది. నేనే కాదు..అందరూ అంతే! అందుకే ఎంత రాత్రి వరకూ మేం ఆడుకున్నా పెద్ద వాళ్ళు దండించే వారు కాదు.

'మరి ఇదేమిటి? జయంతి నవ్వు ఇలా మనసంతా ఆక్రమించుకుంటోంది?' అన్న ఆశ్చర్యంలో మునిగిపోయాను.

అది అంతం కాని ఆరంభమని అప్పట్లో నాకు తెలియదు.

ఇక ఆ రోజునుండీ తను నాకు ప్రత్యేకంగా కన్పించడం మొదలు పెట్టింది. తన నవ్వు, నడక, జడ కదలిక, పుస్తకాలు పట్టుకునే భంగిమ..ఇలా అన్నీ కొత్త కొత్తగా ఆకర్షణీయంగా కన్పిస్తున్నాయి. కంఠస్వరం సైతం చాలా ఇంపుగా, వినసొంపుగా మరీ మరీ వినాలన్పింప చేస్తోంది ఎంత విన్నా.

ట్యూషన్ అయిపోయాక..మరునాటి సాయంత్రం మళ్ళీ ట్యూషన్ ప్రారంభం అయ్యే వరకూ నాకు తోచడం మానేసింది పూర్తిగా. ఎంతసేపూ జయంతి గూర్చిన ఆలోచనలే! అయితే మధ్యలో తనను చూడడానికి ఏ కాస్తయినా అవకాశం లేదు. తమ ఇల్లున్నది మా ఇంటికి మూడిండ్ల అవతలే అయినా తను వాళ్ళ నాన్నగారి కార్లో శారదా హైస్కూలుకు వెళ్ళిపోతుంది. నేనేమో థియోసాఫికల్ హైస్కూలుకు పెందలాడే నడుచుకుంటూ వెళ్ళిపోవాలి. సాయంకాలం ట్యూషనుకు తప్ప ఇతర పిల్లలతో ఆడుకోవడాన్కి ఇల్లు కదిలివచ్చే అలవాటు జయంతికి లేదు. అందువల్ల ముఖాముఖాలు చూసుకునేది ట్యూషన్

లోనే.

జయంతి కలిగించిన స్పందనను నాకు చేతనైన విధంగా డిటెక్టివ్ అప్పారావుగాడికి వివరించాను. ఓ రోజు వాడు అరుణా లైబ్రరీ పుస్తకాలు తప్ప స్కూలు పుస్తకాలు చదవడు కాబట్టి ఆ పేరుపడ్డాడు అప్పటికే.

''నీవు జయంతిని ప్రేమిస్తున్నావు!'' అని తేల్చి చెప్పాడు వాడు.

''ఎందుకు ప్రేమించడం?'' అన్నాను అయోమయంగా.

''పెళ్ళి చేసుకోవడానికి!''

''అవునూ, పెళ్ళెందుకు చేసుకోవడం?'' అన్నాను.

వాడు బిక్కముఖం వేశాడు. పెళ్ళెందుకు చేసుకోవాలో చేసుకున్నాక ఏం చెయ్యాలో వాడికీ తెలిసినట్లు లేదప్పటికి. ఎంతసేపూ అపరాధ పరిశోధక గాథలు చదవడం, వీరోచిత చర్యలలో మునిగి తేలాలని కలలు కనడం, స్టీలు ఫ్రేం భూతద్దాలు, ప్లాస్టిక్ బైనాక్యులర్లు పట్టుకుని తిరగడం తప్ప ఇతర విషయాల, విశేషాల జోలికి పోయినట్లు లేదు వాడు.

మొత్తానికి వాడు చెప్పిందే వాస్తవమని నేను గ్రహించి..జయంతిని గాఢంగా ప్రేమించడం మొదలుపెట్టేసరికి వాళ్ళ నాన్నగారికి తిరుపతి బదిలీ అయింది. కానీ కుటుంబాన్ని వేసవి శెలవుల వరకూ ఘటోద్గజపురంలోనే ఉంచడం వల్ల ఒక వైపు ప్రేమ నిరాటంకంగా కొనసాగింది.

వాళ్ళు తిరుపతి వెళ్ళిపోయేప్పుడు సామానులు ప్యాక్ చేయడంలో సహాయపడే మిషతో నేను రెండ్రోజుల పాటు జయంతి నంటి పెట్టుకునే గడప గలిగాను. అంతే! ఆ తరువాత తనని చూడ లేదు.

తననే ప్రేమిస్తూ, మూగగా రోదిస్తూ మూడేండ్లు గడిపాక మా కుటుంబం డొక్కువ్యానులో తిరుమల తిరుపతి యాత్రకు వెళ్ళినప్పుడు..తిరుపతిలో కాలుపెట్టడం ఆలస్యం... జయంతి వాళ్ళ ఇల్లు వెతుక్కుంటూ పరుగు తీసిన నాకు పెద్ద శరాఘాతమే తగిలింది.

జయంతి వాళ్ళ నాన్నగారికి గుంటూరు బదిలీ అవడం వల్ల వాళ్ళు వారం రోజుల క్రితమే ఆ ఇల్లు ఖాళీ చేసి తిరుపతి వదిలారు.

'గోవిందా! గోవింద!' అని ఆక్రోశించింది నా మనసు.

'ఇలా చేశావేమిటి?' అని నామాల స్వామిని నిందించాను తిరుమలలో. ఆయన నవ్వి ఊరుకున్నారు. ఆయన నవ్వు కూడా జయంతి నవ్వులాగే చాలా చమత్కారంగా అనిపించింది.

ఆ తరువాత ఎంత ప్రయత్నించినా వారి గుంటూరు చిరునామా తెలుసుకోలేకపోయాను. ఆ కాలం అలాంటిది..ఏ కాస్తయినా కమ్యూనికేషన్



నెట్‌వర్క్ ఉండేది కాదు. పైగా బిడియం ఎంతో!

నా ప్రేమ మాత్రం కొనసాగిపోతూనే ఉంది మొత్తానికి!

మూడు యుగాలలాగా మరో మూడు సంవత్సరాలు గడిచాక ఓ రోజు జయమ్మ టీచరుగారికీ, మా వీధిలో ఓ నాలుగైదు కుటుంబాల వారికీ పోస్టులో శుభలేఖలు అందాయి. శుభలేఖలు అందుకున్న కుటుంబాలలో మా కుటుంబం కూడా ఒకటి.

శుభ లేఖల సారాంశం..జయంతి వివాహం!...అన్నవరంలో!

మ్రాన్పడిపోయాను! బ్రహ్మాండం బద్దలైపోయింది!!

పెళ్ళికి మా ఊరినుండీ ఎవ్వరూ వెళ్ళలేదు.

అప్పారావుగాడి సహకారంతో నేను పోస్టలు గ్రీటింగ్స్ పంపగలిగాను. అయితే అవి సకాలంలో అందాయో లేదో తెలియదు.

కొద్దిరోజులు గడిచాక నేను జయమ్మ టీచరు గారి దగ్గర్నుండీ శుభలేఖ అడిగి తీసుకుని మా ఇంటికి అందిన శుభలేఖతో కలిపి రెండింటినీ జ్ఞాపకాలతోపాటు పదిలంగా దాచుకున్నాను.

మా తండ్రిగారి కృషితో నాకు డిగ్రీ అయినా చేతికందక మునుపే ఉద్యోగం లభ్యం కావడం, పెద్దల ఒత్తిడితో వివాహం కావడం చకచకా జరిగిపోయాయి.

సంస్కారవతీ, అనుకూలవతీ అయిన భార్య లభించినా, ముత్యాల్లాంటి పిల్లలు ఇద్దరు కలిగినా జయంతి జ్ఞాపకాలు మనసులో ఓ మూలన జీవం పోసుకుంటూనే వచ్చాయి ఇన్నేళ్ళుగానూ. ఇప్పుడనుకోకుండా అప్పారావుగాడు ఈ వార్తలు మోసుకు వచ్చేసరికి..నా మానసిక పరిస్థితి...

పదిహేను రోజుల తరువాత విశాఖకు ప్రయా

ణమయ్యాను అప్పారావు గాడిచ్చిన చిరునామా పట్టుకుని. సుగాత్రికీ, పిల్లలకూ నాలుగు అబద్ధాలు చెప్పి!

★ ★ ★

రైలు దిగి వెళ్ళి హోటల్లో గది తీసుకున్నాను.

లిఫ్ట్‌లో థర్డ్ ఫ్లోర్‌లో అడుగుపెట్టి నా గదిలో అడుగు పెట్టడం ఆలస్యం సూట్‌కేస్ తెరచి షేవింగ్ కిట్ తీసుకుని నీళ్ళగదికి వెళ్ళి నీట్‌గా షేవ్ చేసు కుని మీసాల మధ్యన అక్కడక్కడ మెరుస్తున్న తెల్ల వెంట్రుకలని జాగ్రత్తగా సిసర్స్‌తో ఏరి పారేశాను.

ఆపై షవర్ క్రింద చల్లటి నీటి ధారల మధ్యన అరగంటపాటు అలసట తీరేలా స్నానం కాని చ్చాను.

బెల్ నొక్కి టిఫిన్ తెప్పించుకుని తిని, టీ త్రాగి నీట్‌గా టక్ చేసుకుని, షూ బిగించుకుని, కూలింగ్ గ్లాస్ పెట్టుకుని మహా స్టైల్‌గా, గొప్ప ఉత్సాహంగా బయల్దేరాను పాతికేళ్ళ యువకుడిలా.

ముప్పవారిపాలెంలో ఇల్లు సులభంగానే కనిపె ట్టాడు ఆటో అతను.

ఇన్నేండ్లు గడిచినా, ఆమెలో కళా కాంతీ తగ్గ లేదు. చుక్క లేకపోయినా ముచ్చటగానే వుంది ముఖం. తెల్లటి ముఖంలో కళ్ళక్రింద ఏర్పడుతున్న నల్లటి చారికలు కూడా ఓ వింత అందాన్నాపాదిస్తు న్నాయామెకు.

నన్నసలు గుర్తుపట్టలేదు మొదట! గుర్తుప ట్టాక..

''ఓ రాజారావ్! నీవా?..చెంగల్పట్టు జైలుకు వెళ్ళలేదా?'' అంటూ నవ్వేసింది స్వచ్ఛంగా.

ఆ నవ్వు అలాగే ఉంది. టీవీ మీది ఫోటోలో ఆమె భర్త మరింత మనోహరంగా, అందంగా నవ్వు తున్నాడు.

జయంతి కుమార్తె కాఫీ కప్పు తెచ్చి అందిం చింది.

ఆ అమ్మాయి కళ్ళు, నవ్వు, నడకా, ప్రతి కద లికా ముప్పయి సంవత్సరాల క్రితం నాటి జయంతి రూపాన్ని కళ్ళకు కట్టినట్లు కన్పింప చేస్తున్నాయి.

భర్త ప్రస్తావన వచ్చినప్పుడు ఆమె కళ్ళవెంబడి కన్నీటి చుక్కలు జారిపోయాయి జలజలా..ఆ సమయంలో ఆమె రూపం క్రొత్తగా కన్పించి చాలా బాధ కలిగించింది.

''ప్రపంచంలో ఏ భర్తా చూడనంత ప్రేమగా చూశారు! ఒక జన్మకు సరిపడా సంతో షాలు మాకిచ్చి వెళ్ళిపో యారు!'' అంది గద్గ దంగా.

నా వెన్నుమీద ఎవరో కొరడాతో లాగి బాదినట్లనిపించడమే కాదు ఒళ్ళు జలదరించింది కూడా!

నన్నెంతో ప్రేమించే నా భార్య సుగాత్రి రూపం కళ్ళముందు కదిలింది. ఆమె సంస్కారాన్ని పుణికి పుచ్చుకుని పెరిగి పెద్దవాళ్ళయిన నా పిల్లలు కూడా నవ్వుతూ నాకేసి చూస్తున్నట్లనిపించింది.

ఎక్కడి ఘటోద్గజపురం? ఎక్కడి విశాఖప ట్టణం?

నా నిరీక్షణ ఫలించిందంటూ, అంత దూరమూ నా మనసుమీద స్వారీ చేస్తూ వచ్చిన దురాలోచన అదృశ్యం..కాదు కాదు..అంతం అయింది!!

ఓ వింత వెలుగేదో కాంతివంతంగా, మనోహ రంగా మనోఫలకం మీద దృశ్యమానం అయింది. మనిషితనం నిండిన ఆలోచనలు అవతరించాయి.

చీకటి రాత్రులలో స్త్రీ, పురుష భేదం లేకుండా నిర్మలమైన మనసులతో సందు గొందులలో సబ్జా ఆడితే ఎంత బాగుండును? అని అన్పిం చింది.

ఇంతలో ఆమె ప్రశ్నించింది...

''ఈ వూరు ఏం పనిమీద వచ్చావు?''

''మా అబ్బాయి నాలాగా చెంగల్పట్టు చేరే రకం కాదు. చాలాబుద్ధిమంతుడు. ఎం.సి.ఏ. చేసి హైదరాబాదులో ఉద్యోగం చేస్తూ పాతిక వేలు సంపాదించుకుంటున్నాడు. వాడికి మీ పుత్రికారత్నం భార్గవిని ఇవ్వడానికిష్టపడ్తావేమో ననే ఆశతో ఇంత దూరం వచ్చాను. మావాడు మంచి హ్యాండ్‌సమ్‌గా ఉంటాడు. ఇద్దరూ మేడ్ ఫర్ ఈచ్ అదర్ జంటలా ఉంటారు!'' అన్నాను మనస్ఫూర్తిగా.

ఆనందాశ్చర్యాలతో ఆమె కళ్ళు విశాలమ య్యాయి.

జయంతి నా కళ్ళకిప్పుడు అందంగా కన్పిం చడం లేదు. ఆత్మీయురాలిగా, ఆప్తురాలిగా కన్పి స్తోంది.

☆

## మంచిరోజులొచ్చాయి

**ఎంతో కాలంగా రాజశేఖర్‌ని వూరిస్తూ వస్తోన్న విజయం ఇప్పటికి దక్కింది. 'ఎవడైతే నాకేంటి?' సినిమా సక్సెస్ సాధించడం ఆయనకు కొండంత ఊరటనిచ్చింది. దీంతో తిరిగి నిర్మాతల దృష్టిలో పడిన ఆయ నతో మరిన్ని కొత్త సినిమాల నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. శరత్ కుమార్ నటించిన 'అయ్యా' సినిమాని 'మా దైవం పెద్దాయన' పేరిట తెలుగులో డబ్బింగ్ చేద్దామనుకున్న ఆ నిర్మాతలు తమ నిర్ణయాన్ని మార్చుకుని అదే సినిమాని రాజశేఖర్‌తో తెలుగులో రీమేక్ చేయాలని అనుకుంటున్నారట. అలాగే సూపర్‌గుడ్ ఫిలింస్ సంస్థ కూడా రాజశేఖర్‌తో సినిమా తీయడానికి సన్నాహాలు చేస్తోందిట. సో, రాజ శేఖర్ ముందున్నవన్నీ మంచిరోజులుగానే భావించాలి!**

